క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జెడ్పీసెంటర్ (మహబూబ్‌నగర్): పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో 11 కేవీ లైన్ మరమ్మతు కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ట్రాన్స్‌కో 2 టౌన్ ఏఈ ఆదిత్య శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. తెలంగాణ చౌరస్తా, క్రిష్టియన్‌కాలనీ, బోయపల్లి గేట్, పోలీస్‌లైన్, కలెక్టర్‌బంగ్లా, కోర్టు ప్రాంతాల్లో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని.. వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి



జడ్చర్ల: బ్యాంకుల ద్వారా ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ఖాతాదారులు సద్వినియోగం చేసుకోవాలని ఏపీజీవీబీ రీజినల్ మేనేజర్ సుభాష్ కోరారు. శనివారం మండలంలోని గంగాపూర్‌లో నిర్వహించిన ఆర్థిక అక్షరాస్యత కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఖాతాదారుల ప్రయోజనాల కోసం పీఎంజేజేబీవై, పీఎంఎస్‌బీవైను అమలు చేస్తోందన్నారు. ఈ పథకాల కింద మృతిచెందిన కుటుంబాలకు రూ.12 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. కార్యక్రమంలో బ్యాంకు అధికారి వరప్రసాద్, మేనేజర్ వీరేష్, సర్పంచ్ చెన్నయ్య పాల్గొన్నారు.

ఆదర్శంగా జై భారత్ పొదుపు సంఘం



బాలానగర్: మండలంలోని మోతీఘణాపూర్‌లో ఉన్న జై భారత్ సహకార సంఘం ఆదర్శనీయమని శ్రీ రామలింగేశ్వర సహకార సంఘం సీఈఓ సుమంత్ అన్నారు. సంఘం ఏర్పడి 15 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. గ్రామంలోని ప్రతి ఒక్కరు సంఘంలో చేరి ఆర్థికాభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సహకార భారతి ప్రాంత ప్రముఖ్ పొన్నాల యాదగిరి, కార్యదర్శి మల్లేష్, సంఘం అధ్యక్షుడు పసుపుల ఆంజనేయులు, గ్రామపెద్దలు యాదిరెడ్డి, నర్సింహులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ముందస్తు అరెస్ట్



హన్వాడ: మండలంలోని కాంగ్రెస్ నాయకులను శనివారం పోలీసులు ముందస్తు అరెస్టు చేశారు. రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ జిల్లా కేంద్ర పర్యటన సందర్భంగా ఎలాంటి నిరసన కార్యక్రమాలు చేపట్టకుండా అదుపులోకి తీసుకొని సాయంత్రం సొంత పూచీకత్తుపై వదిలేశారు. అరెస్ట్ అయిన వారిలో యువజన కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శ్రీశైలం, నాయకులు వెంకటయ్య, శారద, వెంకట్‌రెడ్డి, ర్యాకమయ్య, అంజి తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు భయపడేది లేదు

స్టేషన్ మహబూబ్‌నగర్: మంత్రి కేటీఆర్ పర్యటన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులను ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని డీసీసీ అధ్యక్షుడు జి.మధుసూదన్‌రెడ్డి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నియంత పాలనకు నిదర్శనమని.. కాంగ్రెస్ శ్రేణులను అరెస్టు చేసి మంత్రులు ప్రభుత్వ కార్యక్రమాలు నిర్వహించుకోవడం సిగ్గుచేటన్నారు. అక్రమ అరెస్టులకు భయపడేది లేదని పేర్కొన్నారు.

అప్రజాస్వామికం..

కోయిల్‌కొండ: గార్లపహాడ్‌ను మండలం చేయాలంటూ జేఏసీ ఆధ్వర్యంలో సామరస్యంగా రిలే దీక్షలు చేపడుతుంటే జైలుకు పంపడం ఎంతవరకు సమంజసమని జేఏసీ కన్వీనర్ రామునాయక్, వెంకట్రామిరెడ్డి ప్రశ్నించారు. శనివారం నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు, మహబూబ్‌నగర్‌కు ఐటీశాఖ మంత్రి కేటీఆర్ రాక దృష్ట్యా జేఏసీ నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేసి జడ్చర్ల పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌కు తరలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గార్లపహాడ్‌ను మండలం చేయాలని 15 గ్రామాల ప్రజల మద్దతుతో దీక్షలు చేపడుతున్నామని.. ప్రభుత్వం దిగొచ్చే వరకు కొనసాగిస్తామని తెలిపారు.



కొనసాగుతున్న జేపీఎస్‌ల ఆందోళన



మహబూబ్‌నగర్‌లో దీక్ష చేస్తున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

మహబూబ్‌నగర్ రూరల్: తమ ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరుతూ జిల్లాలోని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు తొమ్మిది రోజులుగా ఆందోళన చేస్తున్నారు. దీంతో అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. మండల పరిషత్ కార్యాలయాల్లో పనిచేస్తున్న వారిని గ్రామాలకు ఇన్‌చార్జ్‌లుగా నియమిస్తూ పనులు కొనసాగిస్తున్నారు.

నాలుగేళ్ల క్రితం..

నాలుగేళ్ల క్రితం ప్రభుత్వం ప్రత్యేక పరీక్ష నిర్వహించి జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ఎంపిక చేశారు. జిల్లాలో 441 గ్రామపంచాయతీలు ఉండగా.. 335 మందిని ఎంపిక చేశారు. వీరిలో 33 మంది ఇతర ప్రభుత్వ శాఖల్లో ఉద్యోగాలు రావడంతో రాజీనామా చేయగా.. ఔట్‌సోర్సింగ్ విధానంలో మరో 33 మందిని తీసుకున్నారు. ప్రస్తుతం సమ్మెలో 335 మంది కార్యదర్శులు పాల్గొంటున్నారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా ఎంపిక చేసిన సమయంలో రూ.18 వేల వేతనంగా నిర్ణయించి విధుల్లోకి తీసుకున్నారు. రెండేళ్ల తర్వాత రూ.28 వేలకు పెంచి ప్రొబేషనరీ కాలాన్ని మరో రెండేళ్లు పెంచారు. ఆ కాలం కూడా 2023, ఏప్రిల్ 11తో ముగిసింది. తర్వాత ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా గత నెల 28 నుంచి ఆందోళన బాట పట్టారు.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు..

జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మెలో పాల్గొంటుండటంతో జిల్లా అధికారులు ప్రత్యామ్నాయ మార్గాలు చూస్తున్నారు. గ్రామస్థాయిలో ఇబ్బందులు తలెత్తకుండా పంచాయతీశాఖలో పనిచేస్తున్న సీనియర్ కార్యదర్శులు, జూనియర్ అసిస్టెంట్లు, మండల కార్యాలయాల్లో పనిచేస్తున్న వారిని తాత్కాలికంగా నియమిస్తున్నారు.

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి..



జడ్చర్లలో నిరసన తెలుపుతున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులు



మూసాపేటలో వంటావార్పు నిర్వహిస్తున్న కార్యదర్శులు

జడ్చర్ల: తమ సమస్యలు వెంటనే పరిష్కరించాలని కోరుతూ స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపడుతున్న నిరవధిక దీక్ష శనివారం 9వ రోజుకు చేరింది. మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు వేణుగోపాల్ దీక్ష శిబిరాన్ని సందర్శించి వారికి మద్దతు తెలిపి మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే నెరవేర్చాలని కోరారు. కార్యక్రమంలో కార్యదర్శి అభిలాష్, విజయ్‌కుమార్, ఉదయ్, నిస్సార్, శ్రీకాంత్‌రెడ్డి, శివప్రకాశ్, స్వాతి, సత్యమ్మ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

మూసాపేటలో వంటావార్పు..

అడ్డాకుల: మండల కేంద్రంలో శనివారం జూనియర్ పంచాయతీ కార్యదర్శులు వినూత్నంగా నిరసన వ్యక్తం చేశారు. స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయం ఎదుట వంటావార్పు నిర్వహించారు. కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు శెట్టి శేఖర్ కార్యదర్శులకు సంఘీభావం తెలిపి మాట్లాడారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. అడ్డాకులలోనూ కార్యదర్శుల నిరసన కొనసాగింది. రాచాల సర్పంచ్ తిరుపతయ్య రూ.5 వేలు అందజేశారు. కార్యక్రమంలో సురేష్, మహేందర్, నాగేందర్, అఖిల్, మురళి, కల్యాణి తదితరులు పాల్గొన్నారు.

హన్వాడలో శ్రమదానం..

హన్వాడ: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరవధిక సమ్మె శనివారం కొనసాగింది. మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో కార్యదర్శులు శ్రమదానం చేపట్టి నిరసన వ్యక్తం చేశారు. రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నిరసన కార్యక్రమం చేపట్టినట్లు వెల్లడించారు.వివిధ గ్రామాల కార్యదర్శులు పాల్గొన్నారు.

గండేడ్‌లో..

గండేడ్: మండలంలో జేపీఎస్‌ల నిరసన కొనసాగుతోంది. కార్యక్రమంలో భాగంగా శనివారం తమను క్రమబద్ధీకరించాలంటూ శ్రమదానం చేసి నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

పండుగలతో బంధుత్వాలు పెంపొందుతాయి

• ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి



ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి

బాలానగర్: పండుగలతో బంధాలు, బంధుత్వాలు పెంపొందుతాయని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి అన్నారు. శనివారం మండలంలోని చిన్నరేవల్లిలో జరిగే బొడ్రాయి పండుగ వేడుకల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కులమతాలకు అతీతంగా గ్రామస్తులంతా కలిసి బొడ్రాయి పండుగ, శివాలయ వారోత్సవాలు జరుపుకోవడం శుభ పరిణామమన్నారు. ఆయన వెంట జీసీసీ చైర్మన్ వాల్యానాయక్, డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, సర్పంచ్ లక్ష్మి, గ్రామపెద్దలు చంద్రమౌళి, వెంకట్రామ్‌రెడ్డి, వెంకట్రాములుగౌడ్ తదితరులు ఉన్నారు.

మానవత్వం చాటిన 'సఖి'



శ్యామలమ్మను వాహనంలో తీసుకెళ్తున్న నిర్వాహకులు

పాలమూరు: కుమారుడి దగ్గరకు వచ్చిన ఓ తల్లి తప్పిపోగా సఖి కేంద్రం నిర్వాహకులు చేరదీసి శనివారం తిరిగి అప్పగించారు. వివరాల్లోకి వెళ్తే.. హన్వాడ మండలం బుద్దారం గ్రామానికి చెందిన శ్యామలమ్మ ఈ నెల 3న జిల్లాకేంద్రంలో ఉండే చిన్న కుమారుడి వద్దకు వచ్చింది. తర్వాత కల్లు కోసం బయటకు వెళ్లి తప్పిపోయింది. బీకేరెడ్డికాలనీలో ఓ అపార్ట్‌మెంట్ కింద పడుకొని ఉంటే 4వ తేదీ అర్ధరాత్రి స్థానికులు 'సఖి' కేంద్రానికి సమాచారం ఇచ్చారు. కో–ఆర్డినేటర్ మంజుల ఆధ్వర్యంలో సిబ్బంది శ్యామలమ్మను వాహనంలో కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ ఆమెకు వసతి, ఆహారం, చికిత్స అందించారు. శనివారం వివరాలు తెలుసుకొని కుమారుడికి అప్పగించారు.

వెంటాడుతున్న అకాల వర్షాలు

ఆందోళన చెందుతున్న రైతులు



నవాబుపేట మార్కెట్‌యార్డులో తడిసిన ధాన్యాన్ని తరలిస్తున్న రైతులు



వర్షపు నీటిలో కొట్టుకుపోతున్న ధాన్యం

నవాబుపేట: అకాల వర్షాలు రైతులను వెంటాడుతూనే ఉన్నాయి. తాజాగా శనివారం కురిసిన వర్షానికి స్థానిక మార్కెట్‌కు తీసుకొచ్చిన వరి ధాన్యం నీటి పాలైంది. శనివారం మార్కెట్‌యార్డుకు 230 బస్తాల ధాన్యం వచ్చింది. తేమశాతం ఎక్కువగా ఉండటంతో రైతులు ఆవరణలో ఆరబోయగా ఒక్కసారిగా వర్షం కురవడంతో ధాన్యమంతా నీటిలో కొట్టుకుపోయింది. రైతులు అడ్డుకునే ప్రయత్నం చేసినా లాభం లేకపోయింది. మండల కేంద్రానికి చెందిన గారెమోని సిద్దయ్య ధాన్యం 60 బస్తాలు, పల్లెగడ్డ రాములు 47 బస్తాల ధాన్యం తడిసిపోయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని పలువురు రైతులు కోరారు.

చిరు జల్లులతో చల్లబడిన వాతావరణం

జడ్చర్ల టౌన్: ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న పట్టణవాసులు శనివారం సాయంత్రం కురిసిన చిరుజల్లులతో కాస్త ఉపశమనం పొందారు. రెండ్రోజులుగా మేఘాలు కమ్ముకున్నప్పటికీ ఉక్కబోత అధికంగా ఉంది.

ప్రజా సమస్యలు మంత్రి దృష్టికి తేవద్దనే..



బాలానగర్ పోలీస్‌స్టేషన్‌లో బీజేవైఎం, బీజేపీ నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రజా సమస్యలు మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకురావద్దనే అర్ధరాత్రి అక్రమంగా అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్లకు తరలించారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు నల్లవెల్లి కురుమూర్తి ఆరోపించారు. పార్టీ నాయకుల అక్రమ అరెస్టులను చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు ప్రకటించారు. మంత్రి కేటీఆర్‌ను కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు అనుమతి ఇవ్వాలని అధికారులను కోరినా పట్టించుకోకుండా అర్ధరాత్రి ఇళ్ల వద్దకు వచ్చి నాయకులు మొగిలి మణికంఠ, రాములును అరెస్టు చేయడం సరికాదన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాలు, ప్రజాసంఘాలు ప్రజా సమస్యలను అధికార పార్టీ నాయకుల దృష్టికి తేవడం నేరమా అని ప్రశ్నించారు. గ్రామపంచాయతీ కార్మికులకు 5 నెలలుగా వేతనాలు లేక ఇబ్బందులు పడుతున్నారని.. జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సమ్మె చేస్తున్నా పట్టించుకోవడం లేదన్నారు.

రాష్ట్రంలో అప్రకటిత ఎమర్జెన్సీ..

బాలానగర్: తెలంగాణలో బీఆర్‌ఎస్ పాలన అప్రకటిత ఎమర్జెన్సీని తలపిస్తోందని.. మంత్రి కేటీఆర్ పర్యటన సందర్భంగా కాంగ్రెస్, బీజేవైఎం, బీజేపీ నాయకులను ముందస్తు అరెస్టు చేయడం ఏమిటని బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు సతీష్ రొయ్యల, పార్టీ మండల అధ్యక్షుడు ఆశిపల్లి వేణు ప్రశ్నించారు. ప్రజల ప్రాథమిక హక్కులను కాలరాస్తుందని.. ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు పంపడం నియంత పాలనే అన్నారు. ఏ మంత్రి వచ్చినా లేని సమస్య కేటీఆర్ వస్తే ఎందుకని ప్రశ్నించారు. ముందస్తు అరెస్టు అయిన వారిలో ఆంజనేయులు, శ్రీకాంత్, గోపాల్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

మంత్రి కేటీఆర్‌కు ఘన స్వాగతం

జడ్చర్ల: రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్‌కు శనివారం కావేరమ్మపేట వద్ద స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. మంత్రి తన వాహనం నుంచే అభివాదం చేస్తూ దివిటిపల్లి వద్ద ఐటీ పార్క్ తదితర అభివృద్ధి పనులను ప్రారంభించేందుకు ముందుకు కదిలారు. మంత్రి కేటీఆర్ వెంట రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి తదితరులు ఉన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే జన్మదిన వేడుకలు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలో నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. బీఆర్‌ఎస్ కార్యకర్తలు భారీ గజమాలతో సత్కరించగా.. తహసీల్దార్ ప్రేమ్‌రాజ్, ఎంపీడీఓ జయరాములు, ఎంపీపీ శశికళ, జెడ్పీటీసీ సభ్యుడు విజయ్‌భాస్కర్ రెడ్డి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఈ ప్రాంత అభివృద్ధికి శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, నియోజకవర్గంలోని ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు రాజేంద్రప్రసాద్‌గౌడ్, కార్యకర్తలు బచ్చిరెడ్డి, రాజిరెడ్డి, మాధవులు, రాజు, లక్ష్మీనారాయణ, నాగేశం, రాజ్‌కుమార్, శ్యాంసుందర్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణం నిలిపివేత



పెద్ద నాలాపై నిర్మిస్తున్న అక్రమ కట్టడం ఇదే..

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక శివశక్తినగర్‌లోని పెద్ద నాలాను ఆక్రమించి ఓ వ్యక్తి ఇంటి నిర్మాణం చేపడుతుండగా శనివారం మున్సిపల్ అధికారులు అడ్డుకున్నారు. 100 గజాల పైబడి ఉన్న స్థలాన్ని ఆక్రమించి పునాది తీసి ఇనుప చువ్వలతో పిల్లర్లు వేస్తున్నట్లు తనిఖీలో బయటపడింది. నాలాపై కట్టడాలకు అనుమతి లేకున్నా సదరు వ్యక్తి నిర్మాణం చేపట్టడం గమనార్హం. దీనికోసం ఏకంగా ఓ పవర్ బోరు సైతం తవ్వారు. ఈ విషయమై టీపీఎస్ లక్ష్మీప్రియను వివరణ కోరగా పు కమిషనర్ ప్రదీప్‌కుమార్ ఆదేశాల మేరకు టౌన్ ప్లానింగ్ సిబ్బందిని పంపించి పనులు నిలిపివేయించినట్లు వివరించారు.

ఎంపీఎల్ క్రికెట్ టోర్నీ ప్రారంభం

బాలానగర్: మండలంలోని మోతీఘణాపూర్‌లో మోతీగణాపూర్ ప్రీమియర్ లీగ్ (ఎంపీఎల్) క్రికెట్ టోర్నీ శనివారం ప్రారంభమైంది. గ్రామ మాజీ సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి, గ్రామపెద్ద యాదగిరిరెడ్డి పోటీలను ప్రారంభించారు. వారం పాటు పోటీలు కొనసాగుతాయని నిర్వాహకులు ప్రశాంత్‌రెడ్డి, బాలుజీ, శేఖర్ తెలిపారు. మొదటి బహుమతి రూ.10 వేలు, ద్వితీయ బహుమతిగా రూ.5 వేలతో పాటు జ్ఞాపికలు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో గ్రామపెద్దలు నర్సింహులు, యాదయ్య. రమేష్, నరేందర్ యాదవ్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వరంగ సంస్థల మూసివేత తగదు



జెండా ఆవిష్కరిస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మహబూబ్‌నగర్ న్యూటౌన్: ప్రభుత్వరంగ సంస్థల మూసివేతను అడ్డుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఏఐటీయూసీ జిల్లా ప్రధానకార్యదర్శి మాకం రామ్మోహన్ అన్నారు. శనివారం పురపరిధిలోని బండమీదిపల్లి బుడగజంగాల కమ్యూనిటీ హాల్‌లో మే డే వారోత్సవాల్లో భాగంగా జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని.. కార్మికులు ఐక్యంగా ఉండి పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు నర్సింహ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

'రాందాస్, చిన్నయ్య ఆశయాలను కొనసాగించాలి'



మాట్లాడుతున్న జేఎన్ దేవదానం

చిన్నచింతకుంట: కామ్రేడ్ రాందాస్, చిన్నయ్య ఆశయాలను ప్రతి ఒక్కరూ కొనసాగించాలని ఇఫ్టూ జిల్లా అధ్యక్షుడు జేఎన్ దేవదానం, నాయకుడు సాంబశివుడు కోరారు. శనివారం రాందాస్, చిన్నయ్య 32వ వర్ధంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో స్మారక స్థూపానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఇఫ్టూ జెండా ఎగురవేసి మాట్లాడారు. రాందాస్, చిన్నయ్య మహిళల రక్షణ, వారి ఆత్మ గౌరవానికి పోరాడి పోలీసుల కాల్పుల్లో అమరులయ్యారని గుర్తుచేశారు. కార్యక్రమంలో నాయకులు చంద్రన్న, కొండన్న, అరుణ్‌కుమార్, రాజు, ఆర్‌ఆర్ మన్యం, అంజన్న, గుండన్న, అడివన్న, వెంకటేష్‌గౌడ్, పెంటన్న, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

గొర్రెల పంపిణీపై అవగాహన సదస్సు



మాట్లాడుతున్న ఎంపీపీ రమాదేవి

దేవరకద్ర: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం రెండోవిడత గొర్రెల పంపిణీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ రమాదేవి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గొర్రెల యూనిట్ ధర రూ.1.75 లక్షలుగా నిర్ణయించిందని.. 75 శాతం రాయితీపోను మిగతా రూ.43,750 లబ్ధిదారు చెల్లించాలని వివరించారు. ఇప్పటి వరకు గొర్రెల యూనిట్ పొందని లబ్ధిదారులు దరఖాస్తు చేసుకొనే అవకాశం ఉందని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, ఎంపీఓ శ్రీనివాస్‌రెడ్డి, పశువైద్యాధికారి జీషాన్‌అలీ, గొర్రెల సంఘం జిల్లా నాయకులు గోవింద్ యాదవ్, కేవీ రాజు, గోవర్ధన్ యాదవ్, వివిధ గ్రామాల గొర్రెల సంఘం అధ్యక్షులు, కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే మద్దతు ధర



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మార్కెట్ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి

జడ్చర్ల: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులకు మద్దతు ధర లభిస్తుందని.. సద్వినియోగం చేసుకోవాలని మార్కెట్‌యార్డు చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి కోరారు. శనివారం స్థానిక పత్తి మార్కెట్‌యార్డులో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మొక్కజొన్న, వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను ఆశ్రయించి తక్కువ ధరలకు తమ పంటలను విక్రయించి నష్టపోవద్దన్నారు. కొనుగోలు కేంద్రంలో ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధరకు వరి ధాన్యంతో పాటు మొక్కజొన్న కొనుగోలు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సింగిల్‌విండో చైర్మన్ సుదర్శన్‌గౌడ్, మార్కెట్ డైరెక్టర్లు రంగభాను, వెంకటేశ్వర్‌రెడ్డి, సీఈఓ యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

రేపు 'ఉపాధి' ధర్నా



ఉపాధిహామీ కూలీలతో మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

జడ్చర్ల టౌన్: ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలంటూ సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జగన్ తెలిపారు. శనివారం మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి కూలీల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. నాలుగైదు నెలలుగా కూలి డబ్బులు రావటం లేదని, తక్కువగా నమోదు చేస్తున్నారని కూలీలు వారి దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోజుకు కనీసం రూ.270 ఇవ్వాలని నిబంధన ఉన్నప్పటికీ రూ.170 వరకే ఇస్తున్నారన్నారు. 2020–21 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బిల్లులు సైతం రావాల్సి ఉందని.. వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నాకు కూలీలు అధికసంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఆయన వెంట వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు ఆండాలు, కార్యదర్శి సాయిలు, ఉపాధ్యక్షుడు జయరాములు ఉన్నారు.

కేటీఆర్ సభకు తరలిన బీఆర్‌ఎస్ శ్రేణులు



హన్వాడ: జిల్లాకేంద్రంలో శనివారం జరిగిన రాష్ట్ర ఐటీశాఖ మంత్రి కేటీఆర్ సభకు మండలంలోని కొత్తపేట, హన్వాడ, పెద్దదర్పల్లి, టంకర, గొండ్యాల, కొనగట్టుపల్లి, వేపూర్ తదితర గ్రామాల స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, మహిళలు అధికసంఖ్యలో ప్రత్యేక వాహనాల్లో తరలివెళ్లారు. వెళ్లిన వారిలో ఎంపీపీ బాలరాజు, పార్టీ మండల అధ్యక్షుడు కరుణాకర్‌గౌడ్, మండల రైతుబంధు సమితి అధ్యక్షుడు రాజుయాదవ్ తదితరులు ఉన్నారు.

గ్రామస్తుల వంటావార్పు



మహమ్మదాబాద్: మండలంలోని నంచర్లగేట్ సమీపంలో ఉన్న ఫార్మకంపెనీని తొలగించాలంటూ గ్రామస్తులు చేపట్టిన నిరసన దీక్ష కొనసాగుతోంది. ఇందులో భాగంగా శనివారం గ్రామస్తులు చౌరస్తాలో వంటావార్పు నిర్వహించారు. రోడ్డుపై వంటలు చేసి అక్కడే బైఠాయించి భోజనాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.

నియంత పాలనకు చరమగీతం పాడుదాం

• బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి

నవాబుపేట: కేసీఆర్ నియంత పాలనకు ప్రజలతో పాటు ఉద్యోగులు సైతం ఇబ్బందులు పడుతున్నారని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి అన్నారు. శనివారం మండల కేంద్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు, వీఓఏలు చేపడుతున్న ఆందోళన శిబిరాలను ఆయన సందర్శించి స్థానిక నాయకులతో కలిసి మద్దతు తెలిపి మాట్లాడారు. మూడేళ్ల తర్వాత క్రమబద్ధీకరించాల్సిన వారిని విస్మరించి ఆందోళన బాట పట్టేందుకు సైతం కారణమైన కేసీఆర్ గ్రామ పంచాయతీల అభివృద్ధికి ఆటంకంగా మారారన్నారు. కేంద్రం నిధులు నేరుగా పంచాయతీలకు రావటం జీర్ణించుకోని ముఖ్యమంత్రి పంచాయతి కార్మికులు, ఉద్యోగులను వేధించటం ఆయన నియంత పాలనకు నిదర్శనమని తెలిపారు. కాంట్రాక్టు ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లు నేరవేరేదాక అండగా ఉండి పోరాడుతామన్నారు. ఆయా కార్యక్రమాల్లో బీజేపీ జిల్లా నాయకులు యాదయ్య, శ్రీనివాస్, నర్సింహులు, బాలు, సత్యం, పార్టీ మండల అధ్యక్షుడు రాజు, చంద్రయ్య, కమలాకర్, రఘు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వీరబ్రహ్మాచారి

బైకు, బొలెరో వాహనం ఢీ: ఇద్దరికి తీవ్రగాయాలు



పెబ్బేరు: పట్టణ కేంద్రంలోని కొత్తకోట బైపాస్ వద్ద ఆటోను బైకు ఢీకోవడంతో నరసింహ, కుమారుడు సుదర్శన్‌కు తీవ్ర గాయాలైన ఘటన చోటుచేసుకుంది. పోలీసుల వివరాలలో.. జడ్చర్ల మండలంలోని నాగసాని గ్రామానికి చెందిన నరసింహ, కుమారుడు సుదర్శన్ కొత్తకోట నుంచి పెబ్బేరు సంతకు వస్తున్న క్రమంలో స్పీడ్ బ్రేకర్ల వద్ద బొలెరో వాహనం నెమ్మది కావడంతో వెనకాల వేగంగా వస్తున్న బైకు ఢీకొట్టింది. దీంతో బైకుపై వస్తున్న ఇద్దరికి తీవ్రగాయాలు కావడంతో వనపర్తి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన అనంతరం మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకొని వివరాలు సేకరించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్‌ఐ జగదీశ్వర్ తెలిపారు.